

5/8/90





# గుండెకింది ఎడారి!

-టి. లలితా ప్రసాద్

ఇవాళ వాడి పుట్టిన రోజు

ఈసారి పైకే అనేశాను ఆడుకోడానికి వెళ్లిన పిల్లాడి కోసంలా ఇంకా ఎదురుచూస్తూనే వున్నా. కానీ నన్నూ నా ప్రేమనీ బంధాన్నీ కాదని పెద్దాడు ఎలా వెళ్ళిపోయాడో తెలీడం లేదు. ప్రతీ రోజు ఏదో క్షణంలో వస్తాడన్న ఆశతో గేటువైపు గమనిస్తూనే ఉన్నాను. ఎవర్నో చూసి వాడనుకుని గేట్లోకి పరిగెట్టుకెళతాను. కానీ ఎవరో పిల్లలు ఆడుతూ కనిపిస్తారు. అయినా పెద్దాళ్లం కొంచెం గమనించీ గమనించకో, మూర్ఖంగానో అయిష్టంగా ఎన్నోసార్లు పొరపాట్లు చేశామేమో! కానీ వాడు నాకు జీవితం సరిపడా వ్యధనిచ్చి వెళ్లడం భావ్యమేనా..

'నువ్వో ఫూల్‌వి. పిల్లల్ని కంటాంగానీ వాళ్ల మనసూ ఆలోచనా విధానాలూ మనకిలా ఉండాలని ఎక్కడుంది?' అని ఆయన నన్ను తిడతారు. అదీ నిజమేనేమో అనిపిస్తుంది.

కానీ ఆ రోజు.. ఆ చివరి క్షణమూ నా జీవితాంతం మర్చిపోను. అది నా పీడకలగానే భావించాను. నా ఆందోళనా, వ్యధలకు తార్కాణమైన నిజమని తెలిసినప్పుడు నేనింకా బతికే ఉన్నానా అనీ అనిపిస్తూంటుంది. వాడు నాలో ఎంతో మార్పు తెచ్చాడు. జీవితం గురించీ నిజంగా ఆలోచించడం మొదలెట్టాను. చివరి రోజు అడిగిన ప్రశ్న ఆలోచనలూ సమస్యా పరిష్కార మార్గాలూ మరింత విశాలం చేసింది. మనిషికి మార్పు అవసరమే. కాని ఇలాంటి విచిత్రమైన మార్పు రావాలని కోరుకోలేదు. పెళ్లి విషయంలో తల్లిదండ్రుల్ని కాదన్నా వారి గౌరవాన్ని కాపాడ్డానికి అంగీకరించాను. పెద్దాడు మాత్రం తల్లి విషయం ఆలోచించక అలా వెళ్ళిపోవడం భావ్యమేనా.. వాడి చదువు స్నేహితులూ రాతలూ అదో లోకం అనుకున్నానే గాని నన్ను కాదంటాడని ఊహించనూ లేదు.

సరిగ్గా ఇలాగే ఆ రోజూ సోమవారం. తెల్లారగట్టే స్నానం చేసి పెద్దాడు వరండాలోంచి వీధి గేటు వరకూ పచార్లు చేస్తున్నాడు. కాఫీ ఇచ్చాను. పేపర్ ఆసాంతం చదివాడు. కానీ రోజూలా విశేషాలు నాకు చెప్పలేదు. వాడి పద్ధతిలో కొన్ని రోజులుగా మార్పు గమనిస్తూనే ఉన్నాను. కాఫీ కప్ చేతికందించి మేడ పైకి వెళ్లాడు. వంట పూర్తయి ఆయన భోజనం చేసి ఆఫీస్‌కి వెళ్లారు. నాలో ఏదో భయం ఖంగారూ ఎక్కువయ్యాయి. ఆయనకీ చెప్పలేక పోయాను. వాడెందుకంత ముభావంగా ఉన్నాడో అర్థంగాలేదు. మరో కప్ కాఫీతో పైకి వెళ్లాను. వాడు ఏదో పుస్తకం చదవడంలో మునిగున్నాడు. నా అలికిడికి లేచి కూచున్నాడు. కాఫీ ఇచ్చి దగ్గరగా కూచుని తల నిమురుతూ, 'ఏరా... ఎలా వున్నావ్.. ఏమైంది?..' అంతే. మాటల్ని ఏడుపు మింగేసింది. వాడ్ని పట్టుకుని ఏడ్చాను. నన్ను విడిపించుకునే యత్నం చేశాడు. గట్టిగా పట్టుకుని నా ఆశలన్నీ నీమీదేరా.. అంతా అన్యాయం చేయకండి.. నన్నూ బతకనివ్వండని బతిమిలాడాను చెంపలమీద జారే కన్నీటిని తుడిచి నా కళ్లలోకి చూస్తూ,

అమ్మా, నీకు అమ్మమ్మా, నాన్నలంటే అయిష్టం దేనికి? అని ప్రశ్నించాడు. నా గుండె ఆగినంత పనైంది. ఇలా ప్రశ్నిస్తాడని ఊహించనైనా లేదు. నా చేయి పట్టి నడక నేర్పినవాడు నా అంతరంగాన్ని ప్రశ్నిస్తాడనీ అనుకోలేదు.. అమ్మకే చెప్పని సమాధానం వీడికి చెప్పాల్సి వచ్చింది కానీ తప్పలేదు.

'నాకిష్టం లేని పెళ్లి చేసినందుకు అమ్మమీద నడత నచ్చని మీ నాన్నమీద కోపం'

'మరి.. పెళ్లి..?!

'ఇంటి గౌరవాన్ని తండ్రి ప్రేమనీ కాదనలేక...'

'అదిప్పుడు కాపాడుతున్నావనా..!!'

'అంతే?!..'

'చూడమ్మా, మీరు ప్రేమలేని, తల్లిదండ్రులు కూడా...' ఎంత ధైర్యం అనగలిగాడో... వాడి మొహాన్ని చూడలేకపోయాను. నాలో భయం దిగులూ ఎక్కువయ్యాయి. నా చేతిలోంచి తన చేతిని విడిపించుకుని దూరంగా వెళ్లి వీధివైపు చూస్తూ నుంచుండి పోయాడు. నాకున్న ఒక్క ఆసరా పోయి ఎక్కడో అగాధాల్లోకి పడిపోతున్నట్టు ఎవరో అది చూసి వికటాట్టహాసం చేస్తున్నట్టుంది. తల తిరుగుతోందీ. అక్కడి నుంచి కిందికి నా గదిలోకి ఎలా వచ్చానో తెలీదు. మెట్ల మీంచి జారేనోమో మోచేతికి దెబ్బ తగిలి కదలనీయ లేదు. నన్ను బాధ పెడుతున్నందుకు క్షమించమని అడుగుతాడనీ అనుకున్నాను. ఈ వ్యధలోంచి తేరుకునేసరికి మధ్యాహ్నం రెండయింది. ఎండ వేడిమి బాగా తెలుస్తోంది. ఇంతలో పెద్దాడు తన బట్టలూ పుస్తకాలూ ఉన్న బ్యాగ్‌తో నా దగ్గరికి వచ్చాడు. ఎంతో ఆతృతగా చూశాను. కానీ వాడు నా కొడుకు. నాలాగే కొన్ని విషయాల్లో మూఢంగానూ ఉండొచ్చన్న అనుమానం కలగలేదు.

నన్ను నేను ప్రశ్నించుకునే సమయానికి కొండంత బరువు విరిగి మీద పడినట్లయింది.

అమ్మా, నేను వెళ్ళిపోతున్నాను. నాకోసం వెతక్కు దిగులూ పడకు నాకిష్టం లేదని ఒక్కసారి ఇంటిని, ఇన్నాళ్లూ ప్రాణంలా చూసుకున్న తల్లినీ కాదని వెళ్ళిపోయాడు.

అలా వెళ్లినాడు నేనేమయ్యానో కనుక్కునేందుకు ఎవరిచేతనైనా కనీసం ఫోన్ కూడా చేయించలేదు. ఆ రోజునుంచీ నేను నాకు దూరం అవుతున్నట్టే ఉంది. ఊహ తెలిసినప్పటి నుంచీ వెళ్లే వరకూ నా కంటి ముందే తిరిగి నా ఆనందం, దుఃఖం, కోపం, ఏడుపు అన్నీ ఇన్నాళ్లూ గమనించి నాకు దూరం కావాలని పెద్దాడు ఎలా అనుకున్నాడో అర్థం గావడం లేదు. వాడి తోటివారినీ ప్రశ్నించాను. వాడిని వెతకమని ఆయన్ని వేధించాను. ఎరిగిన వారిని వేధించాను. కానీ ప్రయోజనం కనిపించలేదు. నేనో వింత తల్లిని. ఎదిగిన కొడుకు చెప్తేనేగాని జ్ఞానం కలగని దానిని. వాడు వెళ్లింతర్వాత గాని నా జీవితం ప్రతీక్షణం దగ్గరగా గమనించడం తెలీని దాన్ని. అయినా ఆయన తిట్టడం కొట్టడం బెదిరించడం గొడవలూ రాద్ధాంతాలు సమస్తం భరిస్తున్న నేనే ఆ నిర్ణయం తీసుకోలేకపోయాను. నేనేమయిపోతానో ఆలోచించక పెద్దాడు మాత్రం వెళ్లగలిగాడు.. ప్రేమ ఎరగని ఈ వొట్టి గోడల ఇంట్లోంచి.

చీకటి పడింది. చిన్నాడికి అన్నం పెట్టి హాల్లో సోఫాలో పెద్దోడి ఆలోచనలతో కూర్చుండి పోయాను. కుడివేపున్న వాడి గదిలోకి వెళ్లాలనిపించింది. ఒక్క ఉదుటన లేచి తలుపులు తీశాను. ఆ రోజు వాడు సగం చదివి వదిలేసిన పుస్తకం, గిరాటేసిన పెన్, చింపిన ఉత్తరాలూ అన్నీ అలాగే ఉన్నాయి. అలమార్లో వదిలేసిన పుస్తకాల్లో ఓ మంచి డిజైన్ అట్టున్న పుస్తకం తీశాను. అది వాడి డైరీ. ఆతృతగా పేజీలన్నీ తిరగేశాను. చివరి పేజీలు తప్ప మిగతా అంతా ఖాళీగానే ఉంది. ఒక్కచోట మాత్రం అది వాడి తల్లినైన నా గురించే రాసుకున్నాడు. 'ప్రేమంటే తెలీని వ్యక్తిని పెళ్లి చేసుకుని గౌరవం పేరిట అయిష్టంగా జీవిస్తూ చావువైపు త్వరగా వెళుతోంది.. అమ్మ నిజంగానే ఫూల్..' వీడు నిజంగా నేను కనిపించకపోతే ఏడిచే పిల్లాడేనా అనిపించింది.. నవ్వుకున్నాను ఏడ్చాను గదంతా వెతికాను వాడికోసం. మళ్లీ వీధిలోకి అలాగే వచ్చాను చుట్టూ చీకట్లో వంటరి వీధి దీపాలు తప్ప ఎవరూ లేరు.. చిన్నాడిని కావలించుకుని భోరున ఏడ్చాను.. టైం తొమ్మిదయింది. ఆయన తూలుతూ తుళ్లుతూ వచ్చారు. పిల్లాడి గురించీ కించిత్ ఆలోచనా లేని ఆ మనిషి మీద చెడ్డ కోపం వచ్చింది. పోట్లాడాను తిట్టాను అలిసిపోయి కాళ్లపై పడి ఏడ్చాను. ఆయన కొడతారని అనుకున్నాను కానీ చాలా ప్రేమగా పైకి లేపి కావలించుకుని

నీలా ఏడవను.. వాడంటే నాకూ ప్రేమే.. అని నన్ను వదిలి తూలుతూ పడగ్గదిలోకి వెళుతూ ఇవాళ వాడి పుట్టిన రోజు.. వాడిక్కడే వున్నాడని తెలిసి ఊరూ వాడా తిరిగి తిరిగి వచ్చాను.. నాకు తెలుసు వాడికి నేనంటే అసహ్యమని అందుకే వాడంటే నాకిష్టం.. I Simply Love him but not like you అంటూ పక్కమీద పడిపోయారు. నాకు నిజంగా పిచ్చెక్కింది. ఇద్దరూ నన్ను వెర్రిదాన్ని చేశారు. ఎన్నడూ లేని దిగులూ, ఏకాంతాన్నీ ఇచ్చారు.. ఇలా ఇంకా ఎన్నాళ్లు బతకాలో..

'అమ్మా నన్నెత్తుకోవూ' చిన్నాడు నా కొంగుపట్టుకు లాగుతున్నాడీ లోకంలోకి మళ్లీ...